
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM

మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ఈ నెల 18న శుక్రవారం, అలాగే 19, 20 శని, ఆదివారాలు వస్తున్న సందర్భంగా వరుసగా సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. తిరిగి ఈనెల 21 నుంచి యథావిధిగా మార్కెట్‌లో క్రయ, విక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గమనించాలని ప్రవీణ్‌రెడ్డి కోరారు.



నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్ర, శనివారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి సాయంత్రం 5 గంటలకు ఖమ్మం 16వ డివిజన్‌లో లోటస్ హిల్స్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5.30కి ఖమ్మం నుంచి విజయవాడ వెళ్తారు. 19న శనివారం ఉదయం 11 గంటలకు మంచుకొండ రఘునాథపాలెం పరిధిలో రైతుబజార్‌కు, పీహెచ్‌సీకి అదనపు సౌకర్యాల కల్పన కోసం శంకుస్థాపన చేస్తారు. 11.30కి బూడిదంపాడు పుటానితండా జడ్పీ రోడ్డుకు, బూడిదంపాడు రోడ్డు విస్తరణ పనులతో పాటు ఎస్సీ కాలనీలో ఇంటర్నల్ సీసీ రోడ్లు, డ్రెయిన్లకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.



మెప్మా పీడీగా అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బాధ్యతలు నిర్వహించనున్నారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేసిన మహేందర్ ఫిబ్రవరిలో సెలవుపై వెళ్లారు. జాయింట్ డైరెక్టర్ ప్రమోషన్ కోసం వేచి చూస్తూ తిరిగి ఉద్యోగంలో చేరలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న అభిషేక్ అగస్త్యకు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా సీడీఎంఏ నుంచి గురువారం ఆదేశాలు వచ్చాయి. ఖమ్మంతో పాటుగా మధిర, సత్తుపల్లి, వైరా, కల్లూరు, ఏదులాపురం మెప్మా పర్యవేక్షణను అభిషేక్ చేపట్టనున్నారు.



ఏఐకేఎస్‌లో హేమంతరావుకు చోటు

జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత్ కిసాన్ సంఘ్ (ఏఐకేఎస్) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. ఏఐకేఎస్ జాతీయ మహాసభలు తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించారు. కాగా గురువారం జాతీయ సమితి ఎన్నిక పూర్తి చేశారు. తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడిగా ఉన్న హేమంతరావుకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. కాగా, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులకు అవకాశం దక్కింది. కొంపల్లి గోవిందరావు, మందడపు రాణి, ముత్యాల విశ్వనాథం జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.



ముదిగొండలో నేలవాలిన పంటను చూపిస్తున్న రైతులు



మల్లారంలో కల్లంలో తడిసిన మిర్చిని చూపిస్తున్న రైతు

అన్నదాత విలవిల

అపార నష్టం మిగిల్చిన ఈదురు గాలులు, అకాల వర్షాలు

- చేతికొచ్చిన పంటలు వానపాలు
- కల్లాల్లో ఆరబోసిన ధాన్యంతోపాటు చేలల్లో పంటలకు తీవ్ర నష్టం
- పలుచోట్ల నేల రాలిన మామిడి
- దయనీయంగా ఉమ్మడి జిల్లా రైతుల పరిస్థితి
- పంట నష్టంపై వ్యవసాయ శాఖ ప్రాథమిక సర్వే పూర్తి
- 33 శాతం కంటే అధికంగా దెబ్బతిన్న పంటలకే పరిహారం వచ్చే అవకాశం

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేశాయి. లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో నీటిపాలయ్యాయి. అనేక చోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యంతో పాటు చేలల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట నీటిపాలైంది. రాత్రివేళ వచ్చిన వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. గతంలో పంటలు ఎదిగే తరుణంలోనే ఆకస్మిక వర్షాలు, వడగళ్లతో రైతులు నష్టపోయిన సందర్భాలు అనేకం ఉన్నా.. ఈసారి పంట చేతికి వచ్చే తరుణంతో అకాల వర్షాలతో అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో పంటల నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక సర్వే పూర్తిచేసి పంటల నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయితే పొలంలో 33 శాతం కంటే ఎక్కువగా దెబ్బతిన్న పంటలకే నష్టపరిహారం వచ్చే అవకాశం ఉంది. అయితే 20 శాతం వరకు దెబ్బతిన్న పంటలు కూడా జిల్లాలో అధికసంఖ్యలోనే ఉన్నాయి. అయితే ప్రభుత్వ (మిగతా 6వ పేజీలో)

3,222 ఎకరాల్లో తీవ్రంగా పంట నష్టం..

ఖమ్మం జిల్లా పరిధిలో 3,222 ఎకరాల్లో 33 శాతానికి మించి పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా కల్లూరు, తల్లాడ, వైరా, మధిర, పెనుబల్లి మండలాలతోపాటు ఇతర మండలాల్లోనూ వరి, మొక్కజొన్న, మామిడి, నువ్వు తదితర పంటలు దెబ్బతిన్నాయి. వీటిలో వరి 2,947 ఎకరాలు, మొక్కజొన్న 37 ఎకరాలు, మామిడి 226 ఎకరాలు, నువ్వులు 12 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. కాగా 25శాతం కంటే తక్కువగా సుమారు 4322 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. కోతకు వచ్చిన వరిపొలాలతో పాటు మామిడి, కోసి ఉన్న మొక్కజొన్న తదితర పంటలు కూడా అకాల వర్షాలతో దెబ్బతిన్నాయి.

వానాకాలం పంటల ప్రణాళిక సిద్ధం

- ఖమ్మం జిల్లాలో 5,80,232 ఎకరాలు..
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6,31,124 ఎకరాలు..
- అంచనాల మేరకు వ్యవసాయ శాఖ కార్యాచరణ

ఖమ్మం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వచ్చే వానాకాలం ఖరీఫ్‌కు జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లాలో రైతులు వేయబోయే పంటలు, అందుకు అవసరమైన విత్తనాలకు కార్యాచరణ సిద్ధంచేశారు. ఈ ఏడాది వర్షాలు కాస్త ముందు వస్తాయన్న ఆశాభావంతో ఖరీఫ్‌కు కార్యాచరణ సిద్ధం చేసి ముందుకు పోతున్నారు. రైతులు ఏ పంటలు ఎంతమేర వేస్తారన్న అంచనాతో జిల్లాకు అవసరమైన విత్తనాలు ముందుగానే తెప్పించి అందుబాటులో ఉంచబోతున్నారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులు ప్రాధాన్యత గుర్తించి ఈ సారి పెద్దఎత్తున పచ్చిరొట్ట విత్తనాలను కూడా వ్యవసాయశాఖ పంపిణీ చేయబోతుంది. ఈ సారి మిర్చి సాగు తగ్గి పత్తి, మొక్కజొన్నకు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ భావిస్తోంది.

వానాకాలంలో 5,80,232 ఎకరాలు పంటసాగుకు ఖమ్మం జిల్లాలో ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో వరి 3,04,869 ఎకరాలకుగాను 76,217 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉందని వ్యవసాయశాఖ గుర్తించింది. మొక్కజొన్న 3453 ఎకరాల సాగుకు లక్ష్యం పెట్టుకున్నారు. 863 క్వింటాళ్ల విత్తనాలు, అవసరం ఉంటుందని వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు (మిగతా 6వ పేజీలో)



లొంగిపోయి అభివృద్ధికి సహకరించండి

- మావోయిస్టులకు భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు పిలుపు
- చర్ల మండలం పూసుగుప్ప అడవిలో పర్యటన

6



నేలకొండపల్లిలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

భూ భారతిలో అన్ని సమస్యలకు పరిష్కారం

- 'ధరణి'లోని లోపాలకు చెక్
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- నేలకొండపల్లిలో అవగాహన సదస్సులో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

6



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బీటీపీఎస్ ఉద్యోగికి ప్రథమ స్థానం

6

ప్రాణాలు తీసిన ఈత మోజు

- మున్నేరులో మునిగి ఇద్దరు బాలుర మృతి
- ఇటీవలే పదో తరగతి పరీక్షలకు హాజరు
- క్రికెట్ ఆడుకునేందుకు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి ఈతకు వెళ్లిన వైనం
- మృతులవి నిరుపేద కుటుంబాలు
- గాంధీచౌక్, గుట్టల బజార్‌లో విషాదం



కిరణ్‌తేజ్ (ఫైల్)



బెన్విత్ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆటకు వెళ్తున్నామని చెప్పి, ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందారు. ఈ విషాద ఘటన గురువారం ఖమ్మం నగరంలో గురువారం జరిగింది. నగరంలోని గాంధీచౌక్‌కు చెందిన అన్నం కిరణ్‌తేజ్ (15), గుట్టలబజార్‌కు చెందిన కూచిపూడి బెన్విత్ (14) వేర్వేరు ప్రైవేటు పాఠశాలల్లో చదివి ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశారు.

పరీక్షలు పూర్తయిన అనంతరం ప్రతిరోజు క్రీడా మైదానంలో క్రికెట్ ఆడేందుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 6:30 గంటల సమయంలో క్రికెట్ ఆడేందుకు వెళుతున్నామని చెప్పి ఇంటినుంచి బయటకు వచ్చారు. తర్వాత వారిద్దరూ దానవాయిగూడెం సమీపంలోని మున్నేరులో ఈతకు వెళ్లారు. అక్కడలోనికి దిగి ఈత రాకపోవడంతో ఒకరినొకరు పట్టుకుని నీటిలో మునిగిపోయారు. వారి కేకలు విన్న చుట్టపక్కల వారు కొందరు నీటిలోకి దిగి ఒడ్డుకు తీసుకువచ్చారు. కానీ అప్పటికే ఇద్దరూ మృతిచెందడంతో ఒడ్డుపై ఉన్న వారి సెల్‌ఫోన్ల ఆధారంగా కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఖానాపురం హవేలి పోలీసులు సంఘటనాస్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించగా అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాలను మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్‌ఎస్ నాయకుడు పడగాల నాగరాజు సందర్శించి నివాళులు అర్పించారు.

పేద కుటుంబాలు...

మృతిచెందిన బాలుర కుటుంబాలది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. కిరణ్‌తేజ్ తండ్రి సుబ్బారావు నగరంలోని ఓ బంగారం షాపులో పనిచేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమారులు కాగా, (మిగతా 6వ పేజీలో)

బీజేపీది నిరంకుశ పాలన

- కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీలపై కక్ష
- రాజకీయ ప్రయోజనాల కోసమే నేషనల్ హెరాల్డ్ కేసులో చేర్చారు..
- డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే రాగమయి
- సత్తుపల్లిలో నల్లజెండాలతో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ



కల్లూరులో నల్లజెండాలతో కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

కల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తూ ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌లు విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ కల్లూరులో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో ఏర్పాటైన సభలో వారు ప్రసంగించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల పేర్లను చేర్చడం మోదీ ప్రభుత్వ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమేనని స్పష్టమవుతుందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచే మోదీ చర్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపు నిచ్చారు. ఈడీ, సీబీఐ లాంటి సంస్థల ద్వారా కేసుల నమోదులో ప్రతి పక్షపార్టీల నేతలను బెదిరిస్తూ గొంతు నొక్కాలని చూస్తుందని వారు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ చర్యలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సైనికుల్లా పోరాటం చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, నాయకులు భుక్యా శివకుమార్ నాయక్, ఏనుగు సత్యంబాబు, బాగం ప్రభాకరచౌదరి, యస్‌కే ఉస్మాన్, తురాబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

తేలనున్న ముంపు లెక్క

- మరోసారి పోలవరంపై అధ్యయనం
- మే మొదటివారంలో రానున్న ఐఐటీ ప్రొఫెసర్లు

భద్రాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో పోలవరం ముంపు ఎంతో తేల్చేందుకు రంగం సిద్ధమైంది. ఇంతకాలం పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలోని భద్రాచలం పరిసర ప్రాంతాలకు ముంపు ముప్పు పొంచి ఉందని సాగునీటిరంగ నిపుణులు స్పష్టం చేసిన సందర్భాలు కోకొల్లలు. అయితే ఏపీ ప్రభుత్వం ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి సారించకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం పలు కీలక భేటీల్లో వాస్తవ ముంపు తేల్చాలని పట్టుబడుతూ వచ్చింది. ఈ క్రమంలో ఇటీవల తాజాగా హైదరాబాద్‌లో ఇరు రాష్ట్రాల సాగునీటిరంగ నిపుణులు, అధికారులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీకి చెందిన అధికారులు భేటీ అయ్యా రు. ఇందులో పోలవరం ముంపుపై తృతీయ పక్ష సర్వే నిర్వహించేందుకు ఇరు రాష్ట్రాల మధ్య అంగీకారం సైతం కుదిరింది. దీంతో తృతీయపక్ష సర్వే నిర్వహించేందుకు అవసరమైన ప్రక్రియను చేపట్టాలని పీపీఏను ఇరు రాష్ట్రాలు కోరాయి. ఈ నేపథ్యంలో సర్వే చేపట్టే బృందంలో నిపుణులు, కీలక అధికారులు కసరత్తు చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా తృతీయపక్ష సర్వే నిర్వహించే ముందు ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు సతీష్‌కుమార్, ఫణీంద్ర క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం మే మొదటి వారంలో భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం తదితర మండలాల్లో సందర్శించనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ అధికారులకు అధికారిక సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. కరకట్ట నిర్మాణ డిజైన్ల పరిశీలన కోసం సదరు ఐఐటీ ప్రొఫెసర్లు వస్తున్నట్టు వినికిడి.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు

- ఎన్నికల హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, మాజీ ఎంపీ నామా



రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలను ప్రశ్నించే బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ నిర్బంధాలకు గురిచేస్తోందని బీఆర్ఎస్ నేతలు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, రవిచంద్ర మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా వరంగల్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని కోరుతూ పాలేరు నియోజకవర్గ సమావేశం తిరుమలాయపాలెంలో గురువారం సాయంత్రం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలుకాని శుష్కవాగ్దానాలు ఇచ్చి గాలికి వదిలిందని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందన్నారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో ప్రజల్లో భ్రమలు తొలిగాయని, బీఆర్ఎస్‌ను దూరం చేసుకుని తాము ఏమి కోల్పోయామో ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని, రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని కౌలు రైతులకు కూడా రూ.15వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక కల్లాల వద్ద రైతులు పడుకుంటున్నారని తెలిపారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభ చరిత్రలో నిలిచే విధంగా ఉంటుందన్నారు. కార్యకర్తలు అధికంగా తరలిరావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు అత్యుత్సాహం చూపి కేసులు పెట్టి నిర్బంధాలకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, వైస్‌చైర్మన్ ధనలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు బెల్లం వేణు, బాషబోయిన వీరన్న, మాజీ ఎంపీపీ బెల్లం ఉమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ ఆవిష్కరించారు.

ఏఐకేఎస్ జాతీయ సభ్యుడిగా


విశ్వనాథం



కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని పాల్వంచ పట్టణానికి చెందిన ముత్యాల విశ్వనాథం అఖిల భారతీయ కిసాన్ సభ జాతీయ సమితి (ఏఐకేఎస్) సభ్యుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో ఏఐకేఎస్ 30వ జాతీయ మహాసభను నిర్వహించారు. ఈ సభలో నూతన జాతీయ సమితిలో ఎంపిక చేసిన 115 మందిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం స్థానం దక్కించుకున్నారు. ముత్యాల విశ్వనాథం ఎంపిక పట్ల స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్‌పాషాతో పాటు జిల్లాకు చెందిన పలువురు పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

ఘన చరిత్రకు ఆలవాలం ఖమ్మం ఖిల్లా

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చారిత్రక కట్టడాల (హెరిటేజ్ డే) దినోత్సవాన్ని ప్రతీ ఏటా ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. సహజ సంపదను రక్షించటం, సంరక్షించటం మనబాధ్యతగా భావించి, చారిత్రక కట్టడాలను, నేటి తరానికి వారికి తెలియపర్చేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఖమ్మం నగరంలోని ఖిల్లా ఓ చారిత్రక కట్టడం. వందల ఏళ్ల క్రితం ఖిల్లా నుంచే పాలన సాగించినట్లు చరిత్ర చెబుతుంది. మొత్తం 4 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఖమ్మం ఖిల్లాను నాడు ఫ్రెంచ్ ఇంజనీర్ల సహాయంతో నిర్మించారని చెబుతారు. ఈ ఖిల్లాలో పలు శాసనాలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. నేడు మనం పిలిచే జాఫర్ బావే ఆనాడు కాకతీయుల తీసిన బావి. తొలినాళ్లలో ఖిల్లాపైకి ఎక్కేందుకు మెట్లు అందుబాటులో లేవు. కొన్నేళ్ల అనంతరం ఖిల్లా ఎక్కేందుకు మెట్లు నిర్మించారు.


జాఫర్ బావి


ఖమ్మం ఖిల్లా

మంత్రి తుమ్మల కృషితో

చారిత్రిక కట్టడం ఖిల్లాను పర్యాటక కేంద్రంగా మార్చాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్ణయించారు. వెంటనే రూ.29 కోట్లతో అభివృద్ధి పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖిల్లాపై రోప్ వే ఏర్పాటు, ఇతర నిర్మాణాలకు రూ.29 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఖమ్మం మునిసిపల్ ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించాలని సూచించారు. మంత్రి తుమ్మల కృషితోనే ఖిల్లా అభివృద్ధి జరుగుతుందని స్థానికులు విశ్వసిస్తున్నారు. త్వరలోనే ఖమ్మం ఖిల్లాకు రోప్‌వే అందుబాటులోకి రానున్నది. రోప్‌వేతోపాటు అమ్యూజ్‌మెంట్ పార్కు, మినీ థియేటర్, బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ చారిత్రక కట్టడం రానున్న రోజుల్లో సందర్శకులను ఆకట్టుకునే ప్రదేశంగా మారనుంది.


వినోభానగర్‌లో అటవీశాఖ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణగౌడ్

అగ్ని ప్రమాదాలు జరగకుండా

చర్యలు చేపట్టాలి

- మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించండి
- వాహనాల ద్వారా అడవిలో నీటి తొట్లను నింపండి : డీఎఫ్‌వో కృష్ణగౌడ్

జూలూరుపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని భద్రాద్రి జిల్లా డీఎఫ్‌వో కృష్ణగౌడ్ సూచించారు. గురువారం ఆయన జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని వినోభానగర్ గ్రామాన్ని సందర్శించి అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అనంతారం, నల్లబండబోడు గ్రామాల మధ్య 4 కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్ కింద అటవీ శాఖ ఆధ్వర్యంలో గతేడాది నాటిన మొక్కలను పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలను సేకరించి పలు సూచనలు చేశారు. నాటిన మొక్కలు ఏవైనా ఎండిపోయినట్లయితే వాటి స్థానంలో పశువులకు, పక్షులకు ఉపయోగపడే పండ్ల జాతి మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో నర్సరీలో పెంచుతున్న మొక్కలకు తరుచూ నీటి తడులను అందించి ఎండిపోకుండా కాపాడాలని అన్నారు. నాటిన మొక్కలకు వారం వారం తప్పకుండా నీరు పోయాలని తెలిపారు. వినోభానగర్ నర్సరీలో టేకు, వెదురు, శ్రీగంధం తదితర రకాలకు చెందిన లక్ష మొక్కలను పెంచుతున్నామన్నారు. వేసవిలో అడవి జంతువులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది చూడాలని తెలిపారు. అవసరమైతే వాహనాల ద్వారా నీటిని అటవీ ప్రాంతాలకు తీసుకువెళ్లి తొట్లలో నింపి అందుబాటులో ఉంచాలని తెలిపారు. అటవీ సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా అడవులు నరకకుండా తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ప్రసాదరావు, బీఆర్‌వో నాసుర్బీ, ఎఫ్ఎస్‌వో సలీమ్, ఎఫ్‌బీవోలు కిషన్, రేఖ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ కోసం

కమిషన్‌ను నియమించాలి

తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ లక్ష్మయ్య


మాట్లాడుతున్న తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల్లో ఉన్న ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే కమిషన్‌ను నియమించి ఎస్టీవర్గీకరణ చేపట్టాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, జడ్పీ మాజీ చైర్మన్ చందా లింగయ్యదొర డిమాండ్ చేశారు. గురువారం రాత్రి ఇల్లెందులో ఎస్టీ వర్గీకరణ సాధన కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో ఉన్న అన్నికులాలకంటే ఆదివాసీలే పూర్తిస్థాయిలో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. తరతరాలుగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీవర్గీకరణ కోసం నడుం బిగించాలని కోరారు. ఈ సభలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, వట్టం నారాయణ దొర, పొడుగు శ్రీనాథ్, వట్టం కన్నయ్యలతోపాటు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

గిరిజన మ్యూజియం గురించి తెలియజేయండి

- భక్తులు, పర్యాటకులు సందర్శించేలా చర్యలు తీసుకోండి : పీవో రాహుల్

భద్రాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పాతతరం గిరిజనుల ఆచారవ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, వారి జీవనశైలి, కట్టుబాట్లపై రూపొందించిన గిరిజన మ్యూజియం గురించి భక్తులకు, పర్యాటకులకు తెలియజేసి వారు మ్యూజియాన్ని సందర్శించేలా ఆటో డ్రైవర్లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ కోరారు. గురువారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజనభవన్‌లో ఆటో రిక్షా యూనియన్ లీడర్లు, డ్రైవర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి కొన్ని సూచనలు ఇస్తూ రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు, పర్యాటకులు గిరిజన సంప్రదాయాలతో నెలకొల్పిన మ్యూజియాన్ని చూసేలా భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. గిరిజన వంటకాలు, పాతకాలపు ఇండ్లు వెదురుతో తయారు చేసిన వివిధ కల్చర్‌కు సంబంధించిన బొమ్మలు, పెయింటింగ్ చిత్రాలు అన్ని మ్యూజియంలో ఏర్పాటుచేశామన్నారు. అనంతరం గిరిజన మ్యూజియానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజుతోపాటు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవో సున్నం రాంబాబు, ట్రాఫిక్ ఎస్ఐ మధు, మేనేజరు ఆదినారాయణ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బీటీపీఎస్ ఉద్యోగికి ప్రథమ స్థానం

మణుగూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మణుగూరు బీటీపీఎస్‌లో ఉద్యోగి అయిన పి.రాజేష్ ఉమ్మడి ఖమ్మం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 74 కేజీలు, 110 కేజీల బెంచ్ ప్రెస్ విభాగంలో ప్రథమ స్థానం సాధించాడు. బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న రాజేష్‌ను గురువారం తన చాంబర్‌లో అభినందించారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో రాజేష్ మంచి ప్రతిభ కనబర్చి అనేక విజయాలను సాధించి బీటీపీఎస్‌కు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సంస్థ తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కల్తి నర్సింహారావు, అధికారులు సత్యనారాయణ, మూర్తి, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాజేష్‌ను అభినందిస్తున్న బీటీపీఎస్ సీఈ

వానాకాలం పంటల

ప్రణాళిక సిద్ధం

(5వ పేజీ తరువాయి)

సిద్ధం చేసింది. పత్తి 2,14,490 ఎకరాలుసాగయ్యే అవకాశం ఉంది. ఇందకుగాను 4,29,381 విత్తనాలు సిద్ధం చేయబోతున్నారు. వేరుశనగ 950 ఎకరాలకుగాను 950 క్వింటాల్ల విత్తనాలు సిద్ధంచేయనున్నారు. అలాగే పెసర 165 ఎకరాలు, పిల్లిపెసర 1952 ఎకరాలు, కంది 652 ఎకరాలు, మిర్చి 53442 ఎకరాల్లో సాగువతుందని వ్యవసాయశాఖ అంచనా వేసిప్రణాళిక సిద్ధంచేసింది. ఇందుకు 53,442ప్యాకెట్ల విత్తనాలు సిద్ధంచేయబోతుంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

వానాకాలంలో జిల్లాలో 6,31,124 ఎకరాలల్లో పంటలుసాగు జరగనుందని వ్యవసాయశాఖ సిద్ధంచేసింది. వరి 1,60,956 ఎకరాలో సాగు లక్ష్యం కాగా, 41,489 క్వింటాళ్ల విత్తనాలు, మొక్కజొన్న 86,544 ఎకరాలకు గాను 6924 క్వింటాళ్ల విత్తనాలు, పత్తి 2,04,632 ఎకరాల్లో సాగు కాగా 4,09,254 ప్యాకెట్లు, వేరుశనగ 2791 ఎకరాలకు గాను 1675 క్వింటాల్ల విత్తనాలు, మినము 857 ఎకరాలకుగాను 69 క్వింటాళ్లు, పెసర 131 ఎకరాలకు గాను 10 క్వింటాళ్ల విత్తనాలు, కంది 1159 ఎకరాలకుగాను 46 క్వింటాళ్ల విత్తనాలు, మిర్చి 10,449 ఎకరాలకుగాను 10క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంచేస్తున్నారు. జనుము విత్తనాలు 4వేల క్వింటాళ్లు పిల్లిపెసర 80 క్వింటాళ్లునువ్వులు 500క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంచేస్తున్నారు. అటవీ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తి తోటలు (జామాయిల్, సుబాబుల్) 28,982 ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉంది.

'మైక్రోఫైనాన్స్' వేధింపులు

- మడుపల్లిలో మహిళ ఆత్మహత్యాయత్నం

మధిర రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మైక్రోఫైనాన్స్‌సంస్థ వేధింపులు తాళలేక మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముడుపల్లిలో గుండగాని గోపి ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో తన సతీమణి నిర్మల పేరుమీద మధిరలోని స్పందన ఫైనాన్స్‌సంస్థ నుంచి రూ.60వేల రుణం తీసుకున్నాడు. జనవరి నుంచి నెలకు రూ.3,500 చొప్పున వాయిదాలు చెల్లిస్తున్నాడు. అయితే ఏప్రిల్ 6వ తేదీన ఈ నెల కిస్తీ చెల్లించాల్సి ఉండగా సమయానికి డబ్బులు అందకపోవటంతో సంస్థకు గోపి డబ్బు చెల్లించలేకపోయాడు. దాంతో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో స్పందన ఫైనాన్స్‌సంస్థ ఉద్యోగులు గోపి ఇంటికి వచ్చి అతడి భార్య నిర్మలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రుణం వాయిదాలు సమయానికి కట్టలేకపోయారంటూ అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో మనస్థాపం చెందిన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే చుట్టపక్కలవారు చూసి ఆమెను కాపాడి ఆర్ఎంపీని పిలిచి చికిత్స చేయించారు.

మద్యం మత్తులో దేవస్థానం సిబ్బందిపై దూషణ, దాడి?

భద్రాచలం ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి చెందిన ఈవో కార్యాలయంలో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి మద్యం మత్తులో దేవస్థానం సిబ్బందిపై దూషణలకు పాల్పడటమే కాకుండా, దాడిచేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఒక మహిళా ఉద్యోగి గురించి వచ్చిన ఆ వ్యక్తి మద్యం మత్తులో ఇష్టానుసారంగా దేవస్థానం సిబ్బందిపై వ్యవహరించినట్లు దేవస్థానం వర్గాల ద్వారా తెలుస్తోంది. కారులో వచ్చిన ఆ వ్యక్తి కార్యాలయం ముందు ఇష్టానుసారంగా పార్క్‌చేయడంతో దానిని పక్కకు పెట్టమని సిబ్బంది కోరగా వారిపై దురుసుగా వ్యవహరించినట్లు తెలిసింది. ఈ సమయంలో దేవస్థానంలో పనిచేస్తున్న ఓ అధికారిపై దూషణలు చేసినట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ తరుణంలో దేవస్థానానికి చెందిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై దూషణలకు పాల్పడటమే కాకుండా దాడిచేసినట్లు సమాచారం. దీంతో ఈ విషయమై భద్రాచలం దేవస్థానం సిబ్బంది పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

భూ భారతిలో అన్ని సమస్యలకు పరిష్కారం

- 'ధరణి'లోని లోపాలకు చెక్
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- నేలకొండపల్లిలో అవగాహన సదస్సులో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ



సమావేశంలో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ధరణి చట్టం- 2020లో సమాధానాలు, పరిష్కారం దొరకని అనేక సమస్యలకు పరిష్కారమే భూ భారతి 2025 చట్టమని ఖమ్మం ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ అన్నారు. భూ భారతి-2025 చట్టంపై రైతులకు అవగాహన కల్పించటానికి గురువారం నేలకొండపల్లి వాసవీ భవన్‌లో ఏర్పాటు చేసిన మండలస్థాయి అవగాహన సదస్సులో శ్రీజ మాట్లాడారు. రైతులకు వారి భూములపై వారికి భరోసా కల్పించటానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి-2025 చట్టాన్ని తెచ్చిందన్నారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా రైతులకు పరిష్కారం దొరుకుతుందన్నారు.

రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులో పరిష్కరించటం జరుగుతుందన్నారు. ధరణిలో వ్యవసాయ సబ్-డివిజన్‌పై ఎటువంటి ప్రస్తావన లేదని, భూ భారతిలో ప్రత్యేక దృష్టి పెట్టటం జరిగిందన్నారు. భూ భారతిలో నమోదైన రికార్డుల ఆధారంగా బ్యాంకుల ద్వారా రుణాలు పొందటం కూడా ఇక నుంచి సులువవుతుందన్నారు. భూ భారతిలో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సాదా బైనామాలకు సంబంధించి అప్పీల్‌కు అవకాశం ఉందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు అవసరమైతే న్యాయ సహాయం అందించే వెసులుబాటు ఉందన్నారు. పాత ధరణి పోర్టల్ నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన భూ భారతికి మారుతున్నందున ఎటువంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా చూసేందుకు తొలుత ప్రభుత్వం రాష్ట్రంలో నాలుగు మండలాలను ఎంపిక చేసిందని అందులో నేలకొండపల్లి మండలం ఒకటన్నారు.

సదస్సులో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టం రైతుల పాలిట దెయ్యమైందని, దానిలోని లోటుపాట్లు సరిచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి-2025 చట్టం రైతులకు చుట్టమని, వరమని అన్నారు. 100 సంవత్సరాల వరకు రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టంగా తయారు చేశారు. సదస్సులో జేసీ శ్రీనివాసరెడ్డి, పైలెట్ ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి, డీఏవో పుల్లయ్య, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, తౌఫిక్ హుస్సేన్, ఎంపీడీవో మర్రి యర్రయ్య, ఎమ్మార్వై అల్లం రవికుమార్, ఏఎంసీ చైర్మన్ సీతారాములు, రైతులు పాల్గొన్నారు.

లొంగిపోయి అభివృద్ధికి సహకరించండి: ఎస్పీ

- చర్ల మండలం పూసుగుప్ప అడవుల్లో పర్యటన

చర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు లొంగిపోయి, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు పిలుపునిచ్చారు. గురువారం చర్ల మండలం పూసుగుప్ప అడవుల్లో ఆయన పర్యటించారు. ముందుగా చర్ల చేరుకున్న ఎస్పీ ద్విచక్ర వాహనంపై పూసుగుప్ప గ్రామానికి చేరుకున్నారు. అనంతరం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు వరకు సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ బోర్డర్ నుంచి నిర్మించిన రోడ్డు బీమారంపాడు, రాంపురం గ్రామస్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. పేదలకు మెరుగైన విద్య, వైద్యం, అందించడం పోలీసుల లక్ష్యమన్నారు. త్వరలో చర్ల మండలం పూసుగుప్ప, చెన్నాపురం గ్రామాల్లో నిర్మించిన మొబైల్ వైద్యశాలలను ప్రారంభిస్తామని తెలిపారు.

అలాగే మావోయిస్టుల కారణంగా గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. ఇప్పటికీ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ బోర్డర్‌లోని అనేక గ్రామాల్లో మౌలిక వసతులు లేవన్నారు. అత్యవసర సమయంలో ఆదివాసీలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మావోయిస్టులు ఆలోచన చేయ్యాలని, పార్టీలో పని చేస్తున్న వారు లొంగిపోవాలన్నారు. ఇప్పటికే అనేకమంది మావోయిస్టు పార్టీ సభ్యులు, ఇతరులు లొంగిపోయారని, వారికి పునరావాసం కల్పించామన్నారు. ఎస్పీ వెంట భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ నర్సిరెడ్డి ఉన్నారు. కాగా ఎస్పీ పర్యటన నేపథ్యంలో సీఐ రాజు వర్మ చర్ల అడవుల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.


అడవిలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఎస్పీ

కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించాలి

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల గైర్హాజరుశాతం పెరిగిపోతుందని దానిని అరికట్టేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సింగరేణి జనరల్ మేనేజర్ (పర్సనల్) కవితానాయుడు కోరారు. కార్మికులకు, కార్మిక కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి గైర్హాజరుశాతాన్ని తగ్గించేందుకు అధికారులంతా సమిష్టి కృషి జరపాలని కోరారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో కొత్తగూడెం రీజియన్ పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గైర్హాజరవుతున్న కార్మికులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదవి విరమణ చేసిన కార్మికులకు బెనిఫిట్స్, ఉద్యోగుల పదోన్నతులను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు ఏరియాల్లో కార్మికుల గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేసి గైర్హాజరుకు గల కారణాలను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పర్సనల్ గడిపల్లి రాజేంద్ర ప్రసాద్, డీజీఎం పర్సనల్స్ అజయ్‌కుమార్, ఎస్. రమేష్, వర ప్రసాద్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం కవితానాయుడు

అన్నదాత విలవిల


పంటలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

(5వ పేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం పంటనష్టం 33శాతం దాటితేనే ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం ఇచ్చే అవకాశం ఉంది. కేంద్ర విపత్తు విభాగం విధించిన ఈ నిబంధనలు రైతులకు శాపంగా మారాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5 మండలాల్లో పంట నష్టం జరిగింది. అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, ములకలపల్లి మండలాల్లో 33శాతం పైగా 741 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. అందులో వరి 660 ఎకరాలు, మొక్కజొన్న 64, మునగ 4 ఎకరాలు, మామిడి 13 ఎకరాల్లో నష్టం జరిగింది. వ్యవసాయాధికారులు ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి జిల్లాలో మిర్చితోటలకు కొంత నష్టం జరిగింది. అయితే కల్లాల్లో తడిసిన ధాన్యం, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలు తిరిగి మళ్లీ ఆరబోయడం ద్వారా పెద్దగా నష్టం ఉండదని అధికారులు చెబుతున్నారు. నాణ్యత దెబ్బతిని ధరలో వ్యత్యాసం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రాణాలు తీసిన ఈత మోజు

(5వ పేజీ తరువాయి)

పెద్దకుమారుడు ఏడేళ్ల వయస్సులోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటినుంచి కిరణ్‌ను అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు. ఈత అంటే పంపరేమోనని గురువారం ఉదయం క్రికెట్‌కి వెళుతున్నా అని చెప్పి ఈతకు వెళ్లి మృతిచెందాడు. మృతదేహం వద్ద తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు కలిచివేసింది.

అదేవిధంగా బెన్విత్ తండ్రి ముద్దుకృష్ణ ఖమ్మంలోని కిరాణషాపులో గుమస్తాగా పనిచేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఇంజనిరింగ్ చదువుతున్నాడు. ఇటీవలే బెన్విత్‌ను ఇంటర్‌లో చేర్పించాలని కుటుంబ సభ్యులు చర్చించారు. బెన్విత్ ఈతకు వెళ్లి మృతిచెందడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు కన్నీటిపర్యంతం అయ్యారు.

స్నేహితులకు ముందే తెలుసు..

కిరణ్‌తేజ్ ఈతకు వెళ్లినట్టు కొంతమంది స్నేహితులకు ముందే తెలిసింది. కిరణ్ తన సెల్‌ఫోన్ నుంచి స్నాప్‌చాట్ యాప్‌లో ఉదయం 7.25 గంటల సమయంలో స్నేహితులకు ఫొటో పెట్టాడు. ఏ పనిచేసినా, ఎక్కడికైనా వెళుతున్నా యాప్ ద్వారా ముందుగానే ఫొటోలు పంపేవాడని స్నేహితులు తెలిపారు. స్నాప్‌ఫొటో వచ్చిన కొద్దిసేపటికే మృతిచెందినట్టు తెలియడం బాధ కలిగించిందని స్నేహితులు తెలిపారు.


బెన్విత్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ నీరజ

భూ భారతితో సమస్యలు పరిష్కరించుకోవాలి

» భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఆళ్లపల్లి/గుండాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): భూ భారతిపై ప్రతి ఒక్కరు తెలుసుకుని, భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కారం చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రైతులకు సూచించారు. గురువారం ఆళ్లపల్లి, గుండాలలో మండలాల్లో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వారికి ఉన్న భూ సమస్యలపై, భూమి పట్టాలో ఎక్కకపోవడం, భూమి ఉండి వేరొకరి పట్టాలో నమోదు కావడం, సర్వే నంబర్లు లేకపోవడం, ఇద్దరు వ్యక్తుల మధ్య సాధాబైనామా, వారసత్వ భూ సమస్య, ధరణిలో ఆగిపోవడం ఇలా అనేక విధాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. గతంలో మాదిరిగా కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. షెడ్యూల్(ఏ) ద్వారా ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. అధికారులు గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి భూ భారతిపై అవగాహన కల్పించాలన్నారు. భూ భారతి చట్టంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములతో పాటు ఇంటి స్థలాలకు హక్కుల రికార్డు చేయడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ధరణిలో రద్దు చేసిన అనుభవదారు కాలమ్ తిరిగి చేర్చడంతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో న్యాయం జరుగలేదని భావిస్తే రెండు అంచెల అప్పీలుకు అవకాశం, పేద రైతులకు ఉచిత న్యా య సహాయం కల్పించడం జరుగుతుందన్నారు. వారసత్వంగా పొందే భూములకు వివాదాలు తలెత్తకుండా ముందుగానే రెవెన్యూ అధికారులు విచారణ జరుపుతారని అభ్యంతారాల అనంతరమే రికార్డుల్లో వివరాలు నమోదు చేస్తారని అ న్నారు.. భూ భారతి చట్టంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములతో పాటు ఇంటి స్థలాలకు హక్కుల రికార్డు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటి నుంచే సులభతరంగా, పారదర్శకంగా భూముల వివరాలు తెలుసుకొవచ్చునని అన్నారు. ఆయా కార్యక్రమాలలో ఆర్డీవో మధు, మండల ప్రత్యేక అధికారి ఖుర్షీద్, ఏడీఏ తాతారావు, తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీవో ఎస్వీ సత్యనారాయణ, ఏవో వెంకటరమణ, డాక్టర్ మనీష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

నేడు గుడ్‌ఫ్రైడే



ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు సిలువపై ప్రాణాలు అర్పించిన రోజును గుడ్‌ఫ్రైడేగా క్రిస్టియన్స్ జరుపుకుంటారు. గుడ్‌ఫ్రైడేను క్రిస్టియన్లు పరమపవిత్రంగా భావించే రోజు. గుడ్‌ఫ్రైడే అంటే పండుగకాదని, క్రైస్తవుల ప్రకారం మానవాళి చేసిన పాపాల కోసం జీసస్ తన ప్రాణాలను సిలువపై పణంగా పెట్టాడని పలువురు క్రిస్టియన్ మత పెద్దలు తెలిపారు. జీసస్‌ను సిలువపై వేలాడదీసిన రోజును పవిత్ర శుక్రవారం, బ్లాక్ ఫ్రైడేగా పిలుస్తారు. ఈ రోజున క్రైస్తవులు ఉపవాసం ఉండి దేవుడిని తలచుకుంటూ ప్రార్థనలు చేస్తారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా జిల్లాలోని పలు చర్చిలలో ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. వైరా రోడ్‌లోని ఆర్‌సీఎం, సీఎస్ఐ సెయింట్ పాల్ చర్చి, కరుణగిరి చర్చితోపాటు జిల్లాలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. యేసు క్రీస్తు శిలువ వేయబడిన రోజు శిలువపై తన ప్రాణాన్ని వదిలిన రోజుకనుక క్రిస్టియన్స్ అందరూ ఆయనను స్మరించుకుంటూ ప్రార్థనలు చేస్తారు, తప్పా క్రిస్మస్ పండుగలా శుభాకాంక్షలు చెప్పుకోరు. తాను మానవుల కోసమే జన్మించానని లోకానికి తెలియజేసీ, వారికి తనపై, తన భోధనలపై నమ్మకం కలిగించేందుకు మూడు రోజుల తర్వాత సమాధి నుంచి సజీవుడై అందరికీ దర్శనమిస్తాడు. శిలువపై ప్రాణాలు వదిలిన రోజు అత్యంత విషాదకరమైనప్పటికీ క్రిస్టియన్లు పరమపవిత్రంగా భావించి ఈ రోజును గుడ్‌ఫ్రై డేగా జరుపుకుంటారు.

భూసేకరణకు రైతులు సహకరించండి

» స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్

చంద్రుగొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు నీటిని అందించేందుకు ఏర్పాటు చేయనున్న పంట కాల్వలకు భూములు ఇవ్వాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ రైతులను కోరారు. భూసేకరణ కోసం రైతుల అభిప్రాయం తెలుసుకునేందుకు గురువారం మండలంలోని పోకలగూడెం, రావికంపాడు, గానుగపాడు, తుంగారం, దామరచర్ల గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంట కాలువల్లో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర కంటే నాలుగు రెట్లు అధికంగా పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులు తమ అభిప్రాయాలను సంబంధిత అధికారులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తహీనత నిర్ధారణ కోసం 1800 కిట్ల అందజేత

భద్రాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసీమియా సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నిర్ధారణ కోసం రూ.5 లక్షల విలువైన 1800 కిట్లను గురువారం ఐటీసీ పీఎస్‌పీడీ అధికారులు ఐఆర్‌ఎస్ జిల్లా కోఆర్డినేటరు డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావుకు అందజేశారు. అనంతరం ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, జీఎం పి.శ్యామ్‌కిరణ్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, వి.కామేశ్వరరావు, గోళ్ల భూపతిరావు, పల్లంటి దేశప్ప పాల్గొన్నారు.

ఉచిత ఇంటర్, ఎప్‌సెట్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇంటర్మీడియట్, ఎప్‌సెట్ శిక్షణకు అందించేందుకు ఆసక్తిగల ప్రైవేటు జూనియర్ కళాశాలలు లేదా విద్యా సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాద్రి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి డి.అనసూర్య గురువా రం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను కార్పోరేట్ కాలేజీ పథకంలో ప్రతిభావంతులైన గ్రామీణా ప్రాంత నిరుపేద విద్యార్థులకు ఉచిత ఇంటర్మీడియట్, ఎప్‌సెట్ విద్యలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యను అందించేందుకు జిల్లాలోని ఏదైనా గుర్తింపు పొందిన ఆసక్తి కలిగిన ప్రైవేటు జూనియర్ కళాశాలలు కానీ లేదా విద్యా సంస్థలు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు విశాలమైన వసతి భవనం, కనీస మౌలిక వసతులు కలిగి ఉండాలని, నాణ్యతతో నిర్మించిన భవనము, ధ్వని నియంత్రణ, అగ్ని నివారణ సదుపాయాలు కలిగి ఉండాలని, తరగతుల నిర్వహించుటకు గాని వసతి సౌకర్యాలు కల్పించుటకు గాను ఇండోర్, అవుట్‌డోర్ కార్యక్రమాలు నిర్వహించుటకు అన్ని వసతులు ఉండాలన్నారు. ఎప్‌సెట్ పోటీ పరీక్షల్లో అత్యున్నత ఫలితాలు సాధించి ఉండాలని కోరారు. దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు భద్రాద్రి జిల్లా ఐడీవోసీ కార్యాలయంలోని ఎస్-27 సెకండ్ ఫ్లోర్ నందు గల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

రేపు జీపీఓల విధివిధానాలపై సదస్సు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన ఆఫీసర్స్(జీపీఓ) విధు లు - బాధ్యతలు అనే అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 19వ తేదీన ఖమ్మం లో డీపీఆర్సీ భవనంలో సెమినార్ నిర్వహిస్తునట్లు గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా రెవెన్యూ వ్యవస్థకు కొత్త రూపం ఇస్తూ తెలంగాణ ప్రజా ప్రభు త్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టంలోని అంశాలను భూ భారతి చట్టం నిర్వహణలో గ్రామస్థాయి ఆఫీసర్లుగా ఉండే జీపీవోలకు అవగాహన కల్పించేందుకే ఈ సెమినార్ ఏ ర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల పూర్వపు వీఆర్వోలు పాల్గొనాలని ఆయన కోరారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను భద్రపర్చాలి

» అదనపు కలెక్టర్ శ్రీజ

ముదిగొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం కింద అప్లయి చేసుకున్న దరఖాస్తులను భద్రపర్చాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశించారు. గురువారం ముదిగొండ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజీవ్ యువవికాసం కింద ఎన్ని దరఖాస్తులు వ చ్చాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన ప్రతి దరఖాస్తును భద్రపర్చాలని ఎం పీడీవో శ్రీధర్‌స్వామిని ఆదేశించారు. అకాల వర్షానికి ఏమైనా పంటలు దెబ్బతిన్నాయా అని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌ను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం తడిచిందా లేదా అని తనిఖీ చేయాలని తహసీల్దార్‌కు సూచించారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న శ్రీజ

'సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి'

కొత్తగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మే 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఈ సదస్సులో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎ. జలీల్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఐ. కృష్ణ, హెచ్‌ఎంఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఆం జనేయులు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. శంకర్ రెడ్డిలు అన్నారు. సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమ్మె సన్నాహక జిల్లా సదస్సులో కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడులు కార్మిక హక్కులకు ఉరితాళ్లు వంటివని వాటి, అమలును అడ్డుకునేందుకే మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మికసంఘాలు పిలుపునిచ్చాయని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను లేబర్‌కోడ్‌ల అమలు ద్వారా కేంద్ర బీజేపీ ప్రభుత్వం బలహీనపరుస్తుందని విమర్శించారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే. బ్రహ్మాచారి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జమలయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు నాగభూషణం, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు మధుసూధన్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, జి. రమేష్, బి. మధు, మందా నర్సింహారావు, వీరస్వామి, త్యాగరాజు, తదితరులున్నారు.



మాట్లాడుతున్న కార్మికసంఘాల నాయకులు

దాతల సహకారం అభినందనీయం

» ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సరిరాం



సత్తుపల్లి డిపోలో బస్సును తనిఖీ చేస్తున్న ఆర్‌ఎం సరిరాం

సత్తుపల్లి, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని లాభాలో నడిపిస్తున్న ప్రయాణీకులతో పాటు అభివృద్ధికి దాతల సహకారం కూడా మరువలేనిదని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరాం అన్నారు. గురువారం ఆయన సత్తుపల్లి ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా సందర్శించారు. డిపోలో రికార్డులతో పాటు గ్యారేజీలోని బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం వెంటనే అదనపు ఫ్లాట్‌ఫారంను నిర్మించేందుకు వెంటనే నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకముందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపో పరిధిలోని కల్లూరులో ఇటీవల నిర్మించిన బస్టాండ్ స్థానంలో నూతనం గా భవనాన్ని నిర్మించాల్సి ఉందని, మండలపల్లి, అశ్వారావుపేట, పెనుబల్లి, తల్లాడ బస్టాండ్‌లను ఆధునీకరించేందుకు ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదికలు అందజేశామని చెప్పారు.

రీజియన్‌కు రీప్లేస్ రూపంలో 21కొత్త బస్సులు రాగా వాటిల్లో సత్తుపల్లికి 5బస్సులు వచ్చాయన్నారు. హైదరాబాద్ వరకు ఖమ్మం నుంచి నాన్‌స్టాఫ్ ఏసీ బస్సులను నడిపిస్తుండగా సత్తుపల్లి నుంచి ఉదయం, రాత్రివేళల్లో మూడు చొప్పున ఆపరేట్ చేస్తున్నామని, ఈ క్రమంలో 58శాతం ఓఆర్ సాధిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా హైదరాబాద్‌కు రిటైర్డ్ ఉద్యోగుల కోసం డీలక్స్ సర్వీస్, ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి గతంలో వలే బస్సును ఏర్పాటు చేయాలని, వాడపల్లి పుణ్యక్షేత్రానికి బస్సును నడిపించాలని విలేకరులు అడిగిన ప్రశ్నలకు పరిశీలిస్తామన్నారు. అనంతరం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆర్‌ఎం ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, వీబీఓ కిన్నెర ఆనందరావు తదితరులు ఉన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

దమ్మపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మహిళను వేధిస్తున్న వ్యక్తిపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లగూడెం గ్రామానికి చెందిన జోనెబోయిన నరేష్ అనే వ్యక్తి అదే గ్రామంలోని మహిళను ఈనెల 13న మహిళ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు ఎవరులేని సమయంలో మహిళను వేధించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

కులం పేరుతో దూషించిన మహిళపై...

దమ్మపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మపేట గ్రామానికి చెందిన జాన్‌బీ అనే మహిళ మహిళలకు అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వేధిస్తుంది. గాంధీనగర్ గ్రామానికి చెందిన కాశిన వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఈనెల 15న పోలీస్ స్టేషన్ సమీపంలో అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వేధిస్తుండటంతో ఆ మహిళను ప్రశ్నించారు. కాగా ప్రశ్నించిన వెంకటేశ్వరరావును కులం పేరుతో అసభ్య పదజాలంతో దూషించింది. బాధితుడు ఫిర్యాదు మేరకు గురువారం మహిళపై ఎట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

మామిడి మొక్కలు ధ్వంసం చేసిన వ్యక్తులపై ...

దమ్మపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మామిడి మొక్కలను ధ్వంసం చేసిన వ్యక్తులపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందలపల్లి గ్రామానికి చెందిన పకీర్‌రావుకు అఖినేపల్లిలో ఉన్న భూమిలో మామిడి మొక్కలను నాటాడు. అదేగ్రామానికి చెందిన వేమవరపు రామకృష్ణ, దండాబత్తు కాంతారావులు బుధవారం పకీర్‌రావు చెందిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి మామిడి మొక్కలను ధ్వంసం చేసి చేశారు. ఈ క్రమంలో వారిని ప్రశ్నించిన పకీర్‌రావు కుమారుడు ఏకాంబరేశ్వరరావును అతని స్నేహితుడు కొలికి పోగు కాంతారావులను చంపుతామని బెదిరించారు. దీంతో భయపడిన వారు దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాల వివాదంపై విచారణ



హెచ్‌ఎం నుంచి వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్

దుమ్ముగూడెం ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రామచంద్రునిపేట గిరిజన బాలికల ఆశ్రమపాఠశాల సెల్ఫీ వీడియో వివాదంపై ఐటీడీఏ డీడీ మణెమ్మ వరుసగా ఈనెల 16, 17 తేదీల్లో విచారణ నిర్వహించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులు, హెచ్‌ఎం రాములును విచారించారు. గురువారం సెల్ఫీ వీడియో చేసిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పెనుబల్లి నాగలక్ష్మి ఇంటికి పాతనారాయణరావుపేట వెళ్లి మాట్లాడారు. పాఠశాలలో ఏం జరుగుతుంది...బయట నుంచి వచ్చిన యువకులు వసతిగృహంలోకి చొరబడి ఒక రాత్రంతా బసచేశారా....హెచ్‌ఎం దీనిపై ఏం చర్యలు తీసుకున్నారు...ఆదివాసీ, లంబాడా తెగల విద్యార్థినుల మధ్య ఘర్షణలు ఎందుకు జరుగుతున్నాయి...వీటిపై హెచ్‌ఎం ఎలా స్పందిస్తున్నారనే పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. వీడియో నువ్వే చేశావా...ఎవరైనా చెబితే చేశావా....సెల్‌ఫోన్ నీకు ఎక్కడి నుంచి వచ్చింది...ఎవరు ఇచ్చారు.....విద్యార్థినుల మధ్య ఏ విషయాల్లో గొడవలు జరుగుతున్నాయనే పలు అంశాలపై సమాచారం సేకరించారు. ఐతే వీడియో తన అభీష్టం మేరకే చేశానని, ఎవరి ప్రోద్బలం లేదని తెలిపింది. ఏటీడీఓ అశోక్, జీసీడీఓ మంగతాయారులు పాల్గొన్నారు. ఈ వివాదంపై తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ అశోక్‌లు సైతం హెచ్‌ఎం రాములుతో, విద్యార్థినితో మాట్లాడి వివరాలు సేకరించారు.

సమగ్ర విచారణ జరపాలి: నాయకులు

ఆశ్రమపాఠశాలలో జరుగుతున్న వివాదాలపై విద్యార్థిని నాగలక్ష్మి చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామపెద్ద కూరం బొర్రయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు శివ ప్రశాంత్, టీజీఏఎస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య, ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లు, సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు సంద్రా ఉపేందర్‌లు డిమాండ్ చేశారు. వసతిగృహంలోకి చొరబడి యువకులు బస చేసిన విషయాన్ని బయటకు రాకుండా అధికారులు కాపాడుతున్నారని ఆరోపించారు.

సైబర్ క్రైం కేసులో నిందితుల అరెస్టు

ఖమ్మంక్రైం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): సైబర్‌క్రైం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్‌క్రైం డీఎస్పీ సీహెచ్ఆర్వీ ఫణీధర్ గురువారం తెలిపారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం, కొజ్జగూడేనికి చెం దిన పసలాది మల్లేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా హనుమాన్‌నగర్‌కు చెందిన గద్దె రాజు అనే వ్యక్తులు మాయమాటలు చెప్పి అతడి ఖాతా నుంచి రూ.11,49,000లు నగదును కాజేశారు. ఈ విషయంపై మార్చి 22న నగరానికి చెందిన ఓ వ్యక్తి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారి వివరాలు సేకరించి మల్లేష్‌గౌడ్, రాజును అదుపులోకి తీసుకుని విచారించారు. ఖాతా నుంచి నగదు కాజేశామని ఇరువురు ఒప్పుకోవడంతో వారిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈకేసు ఛేదించిన ఎస్ఐ రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు వైవీ కృష్ణ, నాగేశ్వరరావు, కిషన్‌రావులను సీపీ సునిల్‌దత్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సైబర్‌క్రైం పోలీసులు

చెరువు మట్టి... చేనుకు పుష్టి

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి చేనుకు మేలు చేస్తోంది. వేసవిలో చెరువు నీరు ఎండిపోయినప్పుడు మట్టి తీసి రైతులు పొలాల్లో వేసుకుంటున్నారు. సాగు భూమిలో చెరువు మట్టిని వేసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయి. వర్షాలు పడినప్పుడు అనేక పో షక విలువలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది.

- నేలలోని లవణాల గాఢత తగ్గుతుంది.
- మట్టితోపాటు సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.
- మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి.
- కలుపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని నేలకు ఉంటుంది.
- దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం వస్తుంది.
- నేల సారవంతమై అధిక దిగుబడినిస్తుంది.



చెరువులో పెరుగనున్న నీటి నిల్వలు

చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ పెరుగు తుంది. ఎ క్కువగా నీరు నిలిచే అవకాశం ఉం టుంది. చెరువు మట్టిని పొలాల్లో వే యడం ద్వారా నేల సారవంతం అ వుతుంది. చెరువు మట్టిలో ఎక్కువ గా ఉండే పోషకాల వల్ల నత్రజని ఎక్కువగా అందుతుంది. చెరువు మట్టిని పంట చేనులో వేయడం ద్వారా పంటలు అధిక దిగుబడి సాధించవచ్చు.

వేసవికాలంలో రైతులు చెరువు పూడిక మట్టిని పంట చేనులో వేసుకోవడం ద్వారా భూసారం పెరుగుతుంది. రైతులు వేసవి దుక్కులు దున్నేటప్పుడు 6 నుంచి 7 అంగుళాలపైన నేల దున్నినట్లయితే భూసారం పెరుగు తుంది. పంట దిగుబడి అధికంగా ఉంటుంది.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ

ములకలపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాలో సాగునీటి అవసరాలు తీర్చడానికి గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ ఎత్తిపోతల పథకంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్మాణం పూర్తికాకముందే కూలిపోయే పరిస్థితి వచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. గు రువారం మండలంలోని మాదారం గ్రామం లో సీతారామ ప్రాజెక్టును సందర్శించి ధ్వంసమైన నిర్మాణాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మొదలు కాకముందే పిల్లర్లు కూలుతున్నాయని, సీతారామ ప్రాజెక్టు నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని సీతారామ ప్రాజెక్టు కాల్వపై కట్టిన పాసేజ్ పిల్లర్ కూలిన ప్రదేశాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుగులోత్ శంకర్, పువ్వల వినయ, గంధం ప్ర సాద్‌గౌడ్, మాదారపు లక్ష్మణ్, మాలోత్ ప్రశాంత్, భట్టు నరేష్, సాయి, అజ్మీరా రాము, కృష్ణ, సూర్యం, జాటోత్ రవి, భూక్య సాయి తదితరులున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని విజయనగర్ కాలనీకి చెందిన ఎస్.మురళికి చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.ఏడు లక్షల నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప గురువారం తీర్పుచెప్పారు. కేసు వివరాలు.. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పి.నరేందర్ వద్ద నిందితుడు తన ఆర్థిక అవసరాల నిమిత్తం 2013లో రూ.7లక్షలను అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీనోటు రాసి ఇచ్చాడు. కొంత కాలం తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా 2015లో రూ.7లక్షల కు చెక్కు జారీచేసినాడు. కాగా నరేందర్ తన బ్యాంక్ ఖాతాలో చెక్కును జమచేయగా నిందితుని ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వ్యక్తిపై దాడి: ఒకరి అరెస్టు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): పానీపూరి బండి నడిపే వ్యక్తిపై, ఓ యువకుడు విచక్షణారహితంగా దాడిచేసిన సంఘటన సత్తుపల్లి పట్టణంలోని బైపాస్ రోడ్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్‌కు చెందిన అనుభవ్ గౌతమ్ సత్తుపల్లిలో పానీపూరి బండి నడుపుతూ స్థానిక శ్రీనివాసా టాకీస్ రోడ్‌లో భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో బైపాస్ రోడ్‌లోని జేవీఎంఆర్ అపార్ట్‌మెంట్ పక్కన బండిపై పానీపూరి తయారు చేస్తుండగా, స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన రమేష్ బాధితుడైన అనుభవ్ గౌతమ్‌పై అకారణంగా విచక్షణా రహితంగా దాడి చేశాడు. స్థానికులు గమనించి 100కు డయల్ చేయడం ద్వారా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దాడికి పాల్పడిన రమేష్ పరారవుతుండగా, స్థానికుల సహాయంతో పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గాయ పడిన బాధితుడిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేయగా పోలీసులు విచారణ ప్రారంభించారు.

పాఠశాలలో చోరీ

జూలూరుపాడు, ఏప్రిల్ 17 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని జూలూరుపాడు పంచాయతీ పరిధిలోని కోయకాలనీ ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తుల చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం అర్థరాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తలుపులకు వేసిన తాళాలను పగలగొట్టి లోపలకు చొరబడి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న ఆట వస్తువులు, రికార్డులను చిందరబందరగా పడవేశారు. బీరువా లో ఉన్న రూ.2వేల విలువ చేసే సౌండ్ బాక్స్‌ను ఎత్తుకుని వెళ్లా రు. గత మూడు నెలలుగా గుర్తుతెలియని వ్య క్తులు పాఠశాలలోకి వచ్చి గదులలోని వస్తువులను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు పా ఠశాలను పోలీసులు సందర్శించి, చోరీ ప్రదేశాన్ని పరిశీలించారు. వివరాలను సేకరించారు.



చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దుప్పి మాంసం స్వాధీనం

దమ్మపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన దుప్పి మాంసాన్ని దమ్మపేట ఫారెస్టు అధికారు లు చెన్నువారిగూడెంలో గురువారం స్వాధీనం చేసుకున్నారు. రేంజర్ కరుణాకరచారి తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నువారిగూడెంలోని ఓతోటలో దుప్పి మాం సం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు అటవీసిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లగా, అధికారులను చూసి మాంసాన్ని వదిలిపెట్టి గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడని తెలిపారు. స్వాధీనం చేసుకున్న మాంసం 5 కిలోలు ఉం టుందని పేర్కొన్నారు. మాంసాన్ని దమ్మపేట అటవీ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని రేంజర్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న దుప్పి మాంసం

మైనర్ డ్రైవింగ్‌లపై స్పెషల్ డ్రైవ్

ఖమ్మంక్రైం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టి గత ఏడు రోజుల్లో 15 కేసులు నమోదు చేశామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవులు దృష్టిలో పె ట్టుకుని ప్రతిరోజు వాహనాలు తనిఖీచేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా లైసెన్సునెంబర్లు ప్లేటులేకుండా తిరగడం, నెంబరు ట్యా పర్ కలిగిన వాహనాలు గుర్తించేందుకు తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పట్టుబడిన వాహనాలపై ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇసుక విక్రయంపై కేసు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్17 (ఆం ధ్రజ్యోతి): సత్తుపల్లి పరిసర ప్రాంతాలలో అక్రమంగా ఇసుక విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుం ది. ఆంధ్రాలోని చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన గోలి శివరామిరెడ్డి అనే వ్యక్తి రాజమండ్రి సమీపంలోని గోదావరి ఇసుకను లారీలో తీసుకువచ్చి అనుమతులు లేకుండా విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు పట్టుకున్నారు. లారీని, ఇసుకను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి యజమాని గోలి శివరామిరెడ్డితో పాటు డ్రైవర్ లిఖిత్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిరణ్ తెలిపారు.



రెండో అదనపు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా మురళి మోహన్



మురళిమోహన్, ప్రశాంతి

ఖమ్మంలీగల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రెండో అదనపు సీనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారిగా టి.మురళిమోహన్ రానున్నారు. ఆయన మల్కాజ్‌గిరి కుషాయగూడ నుంచి బదిలీపై వస్తున్నారు. మధిర సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా ఎన్.ప్రశాంతి రానున్నారు. పదో అదనపు చీఫ్‌మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సికింద్రాబాద్ నుంచి మధిర బదిలీపై వస్తున్నారు. గురువారం హైకోర్టు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు.

వనజీవి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ



ఖమ్మంరూరల్,ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్య కుటుంబాన్ని ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్రా వెంకటవీరయ్య గురువారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కోటి మొక్కలు నాటి పచ్చదనం వ్యాప్తికి పాటుపడ్డారన్నారు. వృక్షో రక్షతి రక్షిత అనే నినాదం ద్వారా ప్రతీ ఒక్కరికి పర్యావరణం పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియచేశారని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ సభ్యులు యండపల్లి వరప్రసాద్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక ఫుట్‌పాత్‌లు

- రూ.1.30 కోట్లతో నగరంలో నిర్మాణం
- త్వరలో శంకుస్థాపన చేయనున్న మంత్రి తుమ్మల


ఫుట్‌పాత్ నిర్మాణానికి పరిశీలన చేస్తున్న ఈఈ కృష్ణలాల్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఐటీ హబ్ వరకు ఆహ్లాదకరంగా ఆధునిక మెట్రో నగరాలకు దీటుగా ఫుట్‌పాత్‌లు నిర్మాణం జరగనుంది. నాలుగు అడుగులు వెడల్పుతో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు, ఐటీహబ్ నుంచి స్టేడియంలోకి డిగ్రీ కాలేజీ, పీజీ కాలేజీలోకి వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వీటిని నిర్మాణం జరపనున్నారు. ఇందుకోసం రూ.1.30కోట్లతో నిర్మాణ అనుమతులు తీసుకున్నారు. త్వరలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నిర్మాణం జరిగితే జిల్లా కోర్టు నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్డు, ఐటీ హబ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు అందమైన ఫుట్‌పాత్‌లతో ఆకర్షణయంగా నగరం రూపుదిద్దుకొనుంది.

అందమైన వాల్ పేయింట్స్

ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఐటీ హబ్ వరకు ప్రభుత్వ విద్యాహబ్‌గా ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య గుర్తించారు. ఆప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసేందుకు రహదారుల పక్కన విద్యా సంబంధిత వాల్‌పేయింట్స్ వేయించారు. ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించారు. చిరువ్యాపారులను రైతుబజార్లు, ఇతర ప్రాంతాల్లో వ్యాపారం చేసుకునేందుకు దుకాణాలు సైతం కేటాయించారు.

విద్యార్థుల సౌకర్యం కోసం

అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

సుదూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీకి విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. పక్కనే ఉన్న స్టేడియానికి రెగ్యూలర్‌గా క్రీడాకారులు, వాకర్స్ వస్తున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఐటీహబ్ వరకు ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేస్తాం. ఆ మేరకు కార్యచరణ పూర్తి జరిగింది. త్వరలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ

ఖమ్మంరూరల్,ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు తరుఫున ఖమ్మం రూరల్ మండలం, గోళ్లపాడు-పోలేపల్లి ఉన్నత పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణగా అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్ రెడ్డి వాటర్ ప్లాంట్‌ను విద్యార్థులతో కలిసి గురువారం ప్రారంభించారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్ర తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని వాటర్ ప్లాంట్‌ను పాఠశాలకు అందించినట్లు తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని అన్నిప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేకంగా సైకిళ్ల అందజేసినట్లు గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు శైలేంద్ర, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, కిషోర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ సంతోష్, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య

నేలకొండపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లిలో శ్రీసత్య సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ పెంటరి సంతోష్ గురువారం ప్రారంభించారు. తాగునీటితో పాటుగా, మజ్జిగ, రాగిజావను అందించటం శుభ పరిణామమన్నారు. శ్రీసత్యసాయి సేవా సమితి సేవా కార్యక్రమాలను ఎస్ఐ సంతోష్ అభినందించారు. కార్యక్రమంలోవంగవీటి కృష్ణమూర్తి, గెల్లా వెంకటరమణగుప్తా, గెల్లా జగన్మోహన్‌రావు, దోసపాటి శేఖర్, దోసపాటి రామయ్య, దమ్మాలపాటి సుధాకర్,ఆదినారాయణ, ఏటుకూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంసంక్షేమవిభాగం: కొత్త బస్టాండ్ సమీపంలో 53వడివిజన్ కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఆర్ట్‌ఆఫ్ లీవింగ్ ఖమ్మం వారు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా గురువారం కార్పొరేటర్ శ్రీవిద్య ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పైనంపల్లి సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ తన ద్విచక్రవాహనంపై ఖమ్మం వైపు వెళుతున్నాడు. ఈక్రమంలో పైనంపల్లి టోల్‌ప్లాజా సమీపంలో బండి స్కిడ్ అయ్యి చాలాదూరం రోడ్డుపై ఈడ్చుకెళ్ళింది. దీంతో శ్రీకాంత్ తలకు బలమైన గాయాలైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన వ్యక్తిని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

నేలకొండపల్లి: కోరట్లగూడెంవద్ద గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో అమ్మగూడెం గ్రామానికి చెందిన వాసంశెట్టి వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. అమ్మగూడేనికి చెందిన వాసంశెట్టి వెంకటేశ్వర్లు తన ద్విచక్రవాహనంపై వెళుతూ బండి అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వర్లును 108 వాహనంలో నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచండి

జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

ఖమ్మంవ్యవసాయం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో రైతులకు సరిపడా పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, అపరాలు మొదలైన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి డి పుల్లయ్య సూచించారు. విత్తన కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం రైతుల నుంచి అధికంగా డిమాండ్ ఉన్న విత్తనాలను ఈ సంవత్సరం కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. గత సంవత్సరం యూఎస్7067 అనే పత్తి రకంపై రైతులు ఆసక్తి చూపారని, ఈ ఏడాది ఎస్‌డబ్ల్యూఐఎఫ్‌టీ అనే పత్తి రకాన్ని రైతులు అడిగే అవకాశం ఉందని అన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు కొంగర వెంకటేశ్వర్లు, వి. శ్రీనివాస రెడ్డి, వాసవిరాణి, సరిత, ఏవోలు కిషోర్ బాబు ప్రత్యూష పాల్గొన్నారు.



దండి ఆశయ సాధనకు పునరంకితమవుదాం

సీపీఐ నేతలు మౌలానా, జితేందర్ రెడ్డి


భాస్కర్ స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంరూరల్,ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): సీపీఐనేత, సీనియర్ జర్నలిస్ట్ అమరజీవి దండి భాస్కర్ ఆశయ సాధనకు పునరంకితమవుదామని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఏదులాపురం గ్రామంలో దండి భాస్కర్ తొమ్మిదో వర్ధంతి సందర్భంగా స్మారక స్తూపం వద్ద గురువారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహయ కార్యదర్శి దండి సురేష్, దండి రంగారావు, నాయకులు జానిమియా, ఎర్రబాబు, కర్ణకుమార్, రాంమూర్తి, కమలాకర్, రంగారావు, రామిశెట్టి విజేత, కరుణాకర్, జక్కంపూడి కృష్ణ, గురుమూర్తి, అంబటి సుబ్బారావు, అశోక్ పాల్గొన్నారు.

కేఎంసీ మేనేజర్ గా బుచ్చిబాబు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయ మేనేజర్‌గా బుచ్చిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీలో మేనేజర్‌గా చేస్తున్న ఆయన్ను అనూహ్యంగా కేఎంసీసంస్థకు మేనేజర్‌గా బదిలీచేశారు. అసిస్టెంట్‌కమిషనర్ షఫీవుల్లాను కలిసి బాధ్యతలు చేపట్టారు. ఖమ్మంలో మేనేజర్‌గా పనిచేసిన విజయానంద్‌ను రెండు నెలలక్రితం వరంగల్‌జిల్లాకు బదిలీచేశారు.

వాడ వాడలా మేడే జరపాలి: సీపీఎం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): వాడవాడలా మేడేను జరపాలని, మరోసారి కార్మికుల ఐక్యతను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తెలియజేయాలని డివిజన్ సీపీఎం కార్యదర్శి వై.విక్రమ్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం ఖానాపురం హవేలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నగరంలో మేడే వేడుకలకు కార్మికులు ఎర్రటి దుస్తులు దరించి హాజరు కావాలని కోరారు. ఖానాపురం హవేలి కార్యదర్శి దొంగల దిరుపతిరావు, గాలి అంజయ్య, కత్తుల అమరావతి, గాలి వెంకటాద్రి, పోతురాజు వెంకట్, తిప్పర్తి నర్సింహారావు, జట్ల ఆనందరావు, తాళ్లపూడి మంగమ్మ, సత్తెనపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తుల విభజన

- కేఎంసీలో డివిజన్లు వారీగా ఏర్పాటు
- లబ్ధిదారుల పరిశీలనపై మార్గదర్శకాలు విడుదల


మాట్లాడుతున్న ఎస్సీ, బీసీ కార్పొరేషన్‌ల అధికారులు నవీన్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరణ పూర్తి చేసిన మెప్మా అధికారులు, సీవోలు, ఆర్పీలు ఇక మలి దశ కార్యక్రమంపై దృష్టి సారించారు. గురువారం కేఎంసీ కార్యాలయంలో టీఎంసీ గుడిపూడి సుజాతరాణి సూచనల మేరకు సీవోలు, ఆర్పీలు డివిజన్లు వారీగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను విభజన చేశారు. అనంతరం ఎస్సీకార్పొరేషన్,బీసీ కార్పొరేషన్ అధికారులు నవీన్‌కుమార్, నీలిమా మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువవికాసం మార్గదర్శకాలను వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, ఫిజికల్ దరఖాస్తులుగా విభజన చేసి ప్రతీ దరఖాస్తును ఆయా కార్పొరేషన్‌లకు విడివిడిగా పంపించాలని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా మార్గదర్శకాలు ఉంటాయని వివరించారు. ఎంపిక ప్రక్రియను ఖచ్చితమైన నిబంధనల మేరకు జరుగుతాయని తెలిపారు. నిరుపేదలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాగా ఖమ్మం నగరంలోని రాజీవ్ యువవికాసం దరఖాస్తులు ఆన్‌లైన్ పరిశీలనకు సాంకేతికంగా లైన్ క్లియర్ జరిగింది. మొత్తం దరఖాస్తులు చేసిన వారి వివరాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం నగర పాలక సంస్థకు ఐడీ, పాస్‌వార్డులను కేటాయించింది. కాగా గురువారం కూడా రాజీవ్ యువ వికాసం కౌంటర్లు కొనసాగించారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తి చేసిన వారి దరఖాస్తుల హార్డ్ కాపీలను నేరుగా స్వీకరించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో ఐజీఆర్‌ఎస్‌కు గ్రీన్ సిగ్నల్

- ఈనెల చివరి వరకు 25శాతం రాయితీకి మార్పులు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్‌లో ఐజీఆర్ఎస్ ఇక్కట్లు తొలగిపోయాయి. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ స్టాంప్ రిజిస్ట్రేషన్‌శాఖ ఆధ్వర్యంలో ఇళ్లస్థలాలపై ఇంటిగ్రేటెడ్‌రీడ్రెసెల్ సిస్టమ్(ఐజీఆర్ఎస్) నిబంధనల మేరకు గతంలో ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం సడలింపులు ఇవ్వటంతో ఎల్‌ఆర్ఎస్‌లో ఐజీఆర్ఎస్ ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు లైన్ క్లియర్ జరిగింది. దీంతో సర్వే నెంబర్లు తప్పొప్పులు, ఇళ్లస్థలం విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, స్థలం నెంబర్లు, సర్వేనెంబర్లు ఏడిట్ ఆప్షన్ సౌకర్యం కల్పించారు. ఐజీఆర్ఎస్ సడలింపుతో 25శాతం రాయితీ సౌకర్యం ఈనెల చివరి వరకు వర్తింపు జరుగుతుంది.

20న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్‌సంఘం ఆధ్వర్యంలో ఈనెల20న నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో అండర్-10,13,16బాలురు,బాలికల ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్, నిర్వాహకుడు సీహెచ్. గోపీక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు స్విస్ లీగ్ పద్ధతిలో ఉంటాయని, చెస్‌కిట్‌తో హాజరు కావాలన్నారు. సమాచారం కోసం 9440162749 సంప్రదించాలని కోరారు.

నగర పాలక సంస్థలో మరింత నిఘా

- కీలక విభాగాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కమిషనర్ ఆదేశం
- పారిశుధ్య పర్యవేక్షకుడిపై కార్మిక నేత వివాదంతో నిర్ణయం


తరుచూ వివాదాలు జరిగే డీజిల్ రూమ్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): కేఎంసీలోని ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. పారిశుధ్య పర్యవేక్షక అధికారికి ఓకార్మిక నాయకుడికి మధ్య బుధవారం వివాదం చోటుచేసుకోవటం తెలిసిందే.. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇప్పటికే పటిష్టమైన సీసీకెమెరా వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రధానగేటు నుంచి లోపల బ్లాక్‌ల ఎంట్రీ వరకు కెమెరాలు ఏర్పాటు చేశారు. కొన్ని కారణాల నేపథ్యంలో ముఖ్యమైన విభాగాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయలేదు. అయితే తరుచూ ఏఏవిభాగాల్లో వివాదాలు జరుగుతున్నాయో ఆ ప్రాంతంలో మరింతగా నిఘాపెట్టేందుకు కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఇదే క్రమంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని డీజిల్ రూమ్‌కు నిత్యం కేఎంసీ డ్రైవర్లు, పారిశుధ్య జవాన్లు, కార్మికులు, బయట ప్రజలు ఇష్టారితిగా వచ్చి వెళ్తున్నారు. దీంతో సీసీ కెమరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచాలని కమిషనర్, ఈఈ కృష్ణలాల్‌ను గురువారం ఆదేశించారు.

'శ్రీచైతన్యోత్సవ్' పోస్టర్ ఆవిష్కరణ



ఖమ్మంరూరల్,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో 24న జరిగే జాతీయస్థాయి టెక్నికల్ కల్చరల్ ఫెస్ట్ శ్రీచైతన్యోత్సవ-25 పోస్టర్‌ను కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో నృత్యప్రదర్శనలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బ్లడ్ డోనేషన్, అనాథాశ్రమాల సందర్శన వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, శ్రీవిద్య చెప్పారు.

రైతులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి):అకాలవర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ అన్నారు.గురువారం మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం గ్రామాల్లో పర్యటించారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన వాటిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాలవర్షంతో రైతులు కష్టించి పండించిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటచేతికి వచ్చు సమయంలో వర్షం నట్టేట ముంచిందన్నారు. రైతులు అన్నిరకాల రుణాలు మాఫీచేసి ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘంజిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, సుబ్బారావు, సీపీఎంజిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నరసయ్య, పి.సుభాకర్ పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న పోతినేని సుదర్శన్

తండాల్లో మౌలిక వసతులు కల్పించాలి

సీపీఎం డివిజన్ కార్యదర్శి బండి రమేష్

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గిరిజనతండాల్లో మౌలిక సదుపాయాలు కలిపించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి బండి రమేష్ కోరారు. గురువారం సీపీఎం కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కొమ్ము శ్రీను టి.నాగేశ్వరావు,నరసయ్య, పి.సుధాకర్, మంగతాయి, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోహణ్' టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆరోహణ్ టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్‌ను కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఆవిష్కరించారు. విద్యార్థులకు విద్యతోపాటు వినోదంకూడా అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్చరల్‌తోపాటు ఈవెంట్లు ఏర్పాటు చేశామని, కళాశాల సెక్రటరి కరస్పాండెంట్ జి.ధాత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గందం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతిపై కొర్రీలు


ఆందోళన చేస్తున్న రైతులు

నేలకొండపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవటం ఒక ఎత్తైతే, ప్రభుత్వం కేటాయించిన మిల్లు వద్ద అన్‌లోడ్ చేసుకోవటానికి పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. మూడు రోజులుగా ధాన్యం లోడ్లతో ఉన్న తమ ట్రాక్టర్లను దిగుమతి చేసుకోవటం లేదంటూ రాయగూడెం, కొంగర, అప్పలనర్సింహాపురం గ్రామాలకు చెందిన రైతులు గురువారం కొత్తకొత్తూరు సమీపంలోని దుర్గాభవాని మిల్లు వద్ద ఆందోళనకు దిగారు. మిల్లర్ ధాన్యాన్ని దించుకోవటానికి కొర్రీలు పెడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. క్వింటాల్‌కు కేవలం రూ.రెండువేలు మాత్రమే ఇస్తామని అందుకు ఇష్టమైన రైతుల ధాన్యం మాత్రమే దిగుమతి చేసుకుంటామని మిల్లర్ అంటున్నట్లు రైతులు చెపుతున్నారు. తరుగు పేరుతో అడ్డగోలుగా కోత పెడుతున్నారంటూ ఆరోపిస్తున్నారు. అదేమంటే తేమశాతం ఎక్కువగా ఉంది, తాలు ఉంది, ధాన్యం నాణ్యంగా లేవు అంటూ కొర్రీలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మార్వై ఆలస్యం మధుసూధనరావు మిల్లు వద్దకు వచ్చి రైతులు, మిల్లర్‌తో మాట్లాడి ప్రస్తుతానికి సమస్యను పరిష్కరించినప్పటికీ, శాశ్వత పరిష్కారం గావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలి: ఎమ్మెల్యే

పెనుబల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకొని మద్దతు ధరతోపాటు సన్నరకం వడ్లకు రూ.500బోనస్ పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా మట్టా రాగమయి అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మళకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరితో కలిసి ప్రారంభించారు. సన్నధాన్యానికి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర ద్వారా రైతులకు లబ్ధి చేకూరనున్నదని పేర్కొన్నారు. పెనుబల్లి, వీఎం బంజర్‌లో కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గంటా ప్రతాప్‌తో కలిసి ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజ ప్రభాకర్‌చౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో రైతన్న కుదేలు

కల్లాల్లో తడిసిన మిర్చి, నేలకొరిగిన మొక్కజొన్న

మధిర రూరల్ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోవడం, గాలివానకు మొక్కజొన్న, వరి నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మధిర మండలంలో రైతులు ఈ ఖరీఫ్‌లో 5వేల ఎకరాల్లో మిర్చి సాగుచేశారు పండినపంట చివరి కోతకోసం రైతులు కల్లాల్లో ఆరబోశారు. మల్లారం, రొంపిమళ్ల, జాలిముడి, రామచంద్రాపురం గ్రామాల్లో రైతులు మిర్చి తడిసిపోయింది. అలాగే మధిర మండలంలో ఈ రబీలో 1300 ఎకరాల్లో రైతులు మొక్కజొన్నసాగుచేశారు. 2400 ఎకరాల్లో వరిసాగుచేశారు. నిదానపురం, దేశినేనిపాలెం, వంగవీడు, సిరిపురం గ్రామాల్లో గాలివానకు మొక్కజొన్న నేలకొరిగింది. మాటూరు గ్రామంలో వరిపంట పడిపోయింది. వేలాదిరూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేస్తే అకాలవర్షంతో నష్టం జరిగిందని రైతులువాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ధాన్యం రైతుల పరిస్థితి దైన్యం

తల్లాడ: దాళ్వా వరి పండించిన ధాన్యం రైతుల పరిస్థితి దైన్యంగా మారింది. తక్కువ తేమశాతం వచ్చినప్పటికి గన్నీసంచుల కొరత వల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు వారాల తరబడి పడిగాపులు కాస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాలలో కల్లాల్లోని ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుత రబీ సీజన్‌లో తల్లాడ మండలంలో 19వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. నెలరోజులుగా మండలంలో వరికోతలు, నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కోసం మండలంలో 24 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. వీటిలో తల్లాడ సొసైటీ పరిధిలో ఏడు, గంగదేవిపాడు సొసైటీ పరిధిలో ఆరు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ రెండు సొసైటీల పరిధిలోని కొనుగోలు కేంద్రాలలో అమ్మేందుకు ఎక్కువగా ధాన్యం వస్తుంది. ఇప్పటి వరకు తల్లాడ సొసైటీ పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలకు 75వేల గన్నీసంచులు, గంగదేవిపాడు సొసైటీ పరిధిలో ఆరు కొనుగోలు కేంద్రాలకు 80వేల గన్నీసంచులు వచ్చాయి. ఈ రెండు సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రాలకు తక్షణం లక్షన్నర గన్నీ సంచుల అవసరం ఉంది. సరిపడా గన్నీసంచుల అందుబాటులో లేక రెండువారాల క్రితం నూర్పిళ్లు జరిగి 17లోపు తేమశాతం వచ్చినప్పటికి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోనే ధాన్యంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సరిపడా గన్నీసంచులు సరఫరా చేయాలని తడిచిని ధాన్యంను కొనుగోలు చేసి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

అకాల వర్షంతో రైతుల ఇబ్బంది

ముదిగొండ: మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మండలంలోని వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. ఒకవైపు ఎండ తీవ్రత మరోవైపు అకాల వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాగుచేసిన పంటలను కాపాడుకొనేందుకు దిగాలు చెందుతున్నారు. మంగళవారం రాత్రి అకాల వర్షానికి పంటపొలాల్లోనే కాకుండా కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కూడా తడవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ఉండేందుకు పట్టాలతో రైతులు పరుగులు పెట్టినప్పటికీ ఈదురుగాలులు రావడంతో ధాన్యంపై కప్పిన పట్టాలు తొలగిపోయి ధాన్యం తడిచిపోయిందని రైతులు వాపోతున్నారు. కోతలకు సిద్ధంగా వరి, మొక్కజొన్న వంటి పంటలు బలంగా ఈదురుగాలులు వీచడంతో నేలకొరిగాయని రైతులు పేర్కొన్నారు. ఈ అకాల వర్షం వల్ల తీవ్ర వాటిల్లిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మల్లారంలో తడిసిన మిర్చిని చూపుతున్న రైతు



తల్లాడలో తడిసిన ధాన్యం



ముదిగొండలో నేలకొరిగిన వరి పైరు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రతిఒక్కరికీ తమ వ్యక్తిగత శుభ్రతలో జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.కనకదుర్గ అన్నారు. గురువారం మండలంలోని బేతుపల్లిలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి వెయ్యి రోజులు ప్రాముఖ్యత, తల్లులకు హ్యాండ్ వాష్, శానిటేషన్, డయేరియా, రక్తహీనత, యోగాపై అవగాహన కల్పించారు. రాగులు, సజ్జలు, సాధులు, కొర్రలు, జొన్నలు, కరివేపాకు, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి ప్రతిజ్ఞ, ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగాజలం, అంగన్‌వాడీ టీచర్లు కాంతమ్మ, కమల, నాగేంద్ర, నాగలక్ష్మీ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

కల్లూరు, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సిహెచ్ నిర్మల జ్యోతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సుజాత, టీచర్లు జ్యోతి, పద్మ, యశోద, మంగామణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

వైరా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరిధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని గొల్లపూడి గ్రామంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా సన్నరకం ధాన్యానికి రూ.500బోనస్ కూడా ఇస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, గిర్దావర్ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ మేడూరి రామారావు, నాయకులు షేక్.సైదా, గోరంట్ల నాగులు, కొమరనేని శ్రీను, గుడిమెళ్ల రామఅప్ప, లాలయ్య, చింతల వెంకన్న, మేడూరి పద్మ, నిమ్మగడ్డ రాజేశ్వరి, దండ్యాల కృష్ణవేణి, షేక్.మైబు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

వైరా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన గురువారం వైరాలో జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలోని అనేకమంది పేదప్రజలు నివాస గృహాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

కొణిజర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని, యువత చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని బీజేపీ జిల్లా నాయకులు సోమదరియాసింగ్ అన్నారు. గురువారం గ్రామంలోని యువత కోరికమేరకు వాలీబాల్, బాడ్మింటన్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను పోత్సహించేందుకు గ్రామంలో ఏ మంచిపనైనా చేసేందుకు ముందుంటానన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం పెరగడంతోపాటు, మానసిక స్థైరం పెంపొందుతుందని అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువులో మంచిగా రాణించి, ఉన్నతులుగా నిలవాలని సూచించారు. తద్వారా తల్లిదండ్రులకు పేరుతేవాలని కోరారు. యువత మంచిమార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు గుగులోతు చందు, బానోతు రాంజీ, శ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

21న మధిరలో మెగా జాబ్‌మేళా

మధిరటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ఉదయం 10 గంటల నుంచి మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేయడం జరిగింద ని మధిర తహసీల్దార్ ఆర్. రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళా ద్వారా 5వేల పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 80కి పైగా కంపెనీలు రానున్నాయని తెలిపారు. ఇతర వివరాలకు 9000037805 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

హిమోఫిలియాపై అవగాహన ర్యాలీ

మధిరటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హిమోఫిలియాపై అవగహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ర్యాలీలు నిర్వహిస్తోందని డీఎంహెచ్‌వో డాక్టర్ బానోత్ కళావతిబాయి అన్నారు. గురువారం ఆమె మధిరలోని ప్రభుత్వ ఆసపత్రి వద్ద హిమోఫిలియాపై అవగహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. అంతకు ముందు టీబీ వ్యాధిగ్రస్తులకు కస్తూరి ఆసుపత్రి వారు వితరణ చేసిన నిత్యావసరాలను అందచేసారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ప్రేమ్, డాక్టర్ రాంమోహన్ నాయక్, డాక్టర్ మణి హర్షిత్ వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మధిరటౌన్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేసారు. అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మధిర పట్టణం, రూరల్‌లో వివిధ గ్రామాలకు చెందిన పదిమందికి ఆరు లక్షల రూపాయల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిడమానూరి వంశీ, తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, బాలరాజు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, బాలరాజు, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు యూనికోడ్ కేటాయింపు

తల్లాడ, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్య యూనికోడ్‌ను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని సత్తుపల్లి ఏడీఏ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం తల్లాడ రైతువేదికలో సత్తుపల్లి డివిజన్ పరిధిలోని ఏఈవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు. భూమి ఉన్న ప్రతీ రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన పూర్తిసమాచారం వివరాలతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నిర్వహించబడుతుదని, రెవెన్యూశాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్‌సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడీని కేటాయించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుకు, పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్దిపొందడానికి ప్రామాణికంగా ఈ రిజిస్ట్రీ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మధిర ఏడీఏ ఎస్. విజయచంద్ర, టెక్నికల్ ఏవో పవన్, తల్లాడ ఏవో ఎండీ తాజుద్దీన్ పాల్గొన్నారు.

'భూ భారతి' సన్నాహక సమావేశం

ఎర్రుపాలెం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోగల మండల పరిషత్ కార్యాలయంలో భూ భారతి కొత్త ఆర్వోఆర్ చట్టంపై నిర్వహించనున్న రైతు అవగాహన సదస్సు సన్నాహకసమావేశాన్ని తహసీల్దార్ ఎం.ఉషాశారద గురువారం మండల అన్ని శాఖల అదికారులతో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎర్రుపాలెం మండలంలో ఈనెల 23న భూ భారతి కొత్త ఆర్వోఆర్ చట్టంపై రైతుల అవగాహన సదస్సు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. మంలంలోనిజమలాపురం గ్రామంలో వాసిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగే ఈసదస్సుపై విస్తృతంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని అదికారులను కోరారు.

భూమిహక్కుల భద్రతకు ప్రజల ఏళ్లనాటి భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు మండలస్థాయిలో రైతులతోపాటు యువకులు, విద్యావంతులు సదస్సుకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమలో ఎంపీడీవో బి.సురేందర్, ఎంపీవో శ్రీలక్ష్మి, ఏవో సాయిశివ, నీటిపారుదల శాఖ డీఈ సాంబశివరావు, విద్యుత్ శాఖ ఏఈలు అనూష, గణేష్, ఐసీడీఎస్ ఏసీడీపీవో కృష్ణశ్రీ, ఏపీఎం హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

వైరా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అణగారిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయంగా పనిచేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం జరిగిన వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ప్రిన్సిపల్ సమత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్ని గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు కాస్మెటిక్, మెస్‌చార్జీలను పెంచిందని తెలిపారు. సన్నరకం బియ్యంతోపాటు అన్నిరకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన అధ్యాపకులను ఎమ్మెల్యే సన్మానించారు. ఆ విద్యాసంస్థల రీజనల్ అధికారి స్వరూపరాణి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, ఎంఈవో వెంకటేశ్వర్లు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం

కల్లూరు, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి) ఏఐసీసీ పిలుపు మేరకు కల్లూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్‌లు ప్రసంగిస్తూ దేశం, రాష్ట్రంలో మత విద్వేష పార్టీలను తరిమి కొట్టాలని పిలుపు నిచ్చారు. దేశ స్వాతంత్ర యోధుడు మహాత్మాగాంధీని కించపరుస్తూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్న తరుణంలో ప్రజలందరు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ గ్రామాన ప్రజలంతా ఏకమై గడప, గడపకు దేశ గొప్పతనం, మహనీయుల త్యాగాలు, బాపుజీ కన్న కలలు, అంబేద్కర్ రాజ్యాంగ హక్కులు ప్రజల్లో తీసుకోవెళ్లాలని వారు పిలుపు నిచ్చారు. ఇంకాను తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హమీలు మాత్రమే కాకుండా, ఇవ్వని హమీలు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ఎలా నిర్వహించాలని దిశ నిర్దేశం చేసిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.వీరభద్రం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, ఏఎంసీ ఛైర్మన్ బాగం నీర జదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, తోటకూర శేషగిరిరావు, కొండపల్లి శ్రీమన్నారయణ, మాదిరాజు అన్నమరాజు, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీనువాసరావు, ఆళ్ల నరిసింహారావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, బుర్రీ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కల్లూరులో గురువారం 120 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలలో కల్లూరు ఆర్డీవో ఎల్ రాజేంద్రగౌడ్, తహసిల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్ లబ్దిదారులు పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రం సందర్శన..

పుల్లయ్యబంజరలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాగమయి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి రైతులతో మాట్లాడతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ప్రతి ధాన్యం గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పంటల వివరాలను, కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆకాల వర్షాలతో తడిచిన ధాన్యం వివరాలు అధికారులు, రైతులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకొని ప్రస్తుత పరిస్థితిని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకోవెళ్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు బోగస్ ప్రచారాలను నమ్మవద్దని రైతులను రాగమయి కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

రహదారి నిర్మాణాన్ని ప్రారంభించాలని

గ్రామస్థుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న లంకాసాగర్ గ్రామస్థులు

పెనుబల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండాలపాడు క్రాస్‌రోడ్డు నుంచి లంకాసాగర్ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదని నిరసన వ్యక్తం చేస్తూ లంకాసాగర్ గ్రామస్థులు గురువారం క్రాస్‌రోడ్డులో ధర్నా నిర్వహించారు. రెండేళ్లైనా నిర్మాణం పూర్తికాని రహదారి అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన లంకాసాగర్ గ్రామస్థులు గురువారం నిరసన వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. రహదారి నిర్మాణం పూర్తికాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు, పాదచారులు ఈ రహదారి వెంట వెళ్లే అవకాశం లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిలో అనేక రైస్‌మిల్లులు ఉండటం వల్ల నిత్యం ధాన్యం లోడ్ లారీలు వందలాదిగా వస్తున్నాయని, రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో దుమ్ము, ధూళి లేచి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని వారు డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ మందలపు అశోక్‌కుమార్, కొల్లి గోపాలరావు, సీపీఎం నాయకులు చలమాల విఠల్‌రావు, కంటే సత్యం, బీజేపీ నాయకులు పడిగల మధుసూదన్‌రావు, కనకాల వెంకటస్వామి పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌యువ వికాసం పథకానికి పట్టణంలో దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయి విచారణ గురువారం చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహ ఆధ్వర్యంలో వార్డు ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను సేకరించారు. 21-55ఏళ్ల మధ్య నాన్-అగ్రికల్చర్ స్కీమ్, వ్యవసాయ పథకాలకు 21-60 ఏళ్ల మధ్య అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించగా దరఖాస్తుకు జతపరిచిన ధ్రువపత్రాలను సరిచూసుకోవడం, గతంలో ఏమైనా ఆయా కార్పోరేషన్ల ద్వారా లబ్దిపొందారా అని ఆరా తీశారు. ఐదేళ్ల లోపులో రేషన్ కార్డులోని ఒక్క వ్యక్తి కూడా ఏ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్దిపొందకుండా ఉండాలని కమిషనర్ సూచించారు.

వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోండి

కారేపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లకు రావాల్సిన వేతానాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మండల తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. గత మూడు నెలలుగా తమకు రావాల్సిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఇన్‌చార్జ్ ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నర్సయ్య మాట్లాడుతూ గత మూడు నెలలుగా తమకు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే తమకు రావాల్సిన వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బస్వాపురంలో కనకదుర్గమ్మ జాతర



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొణిజర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం బస్వాపురంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద దుర్గమ్మజాతర గురువారం జరిగింది. గ్రామస్థులు ప్రతి ఏడాది చైత్రశుద్ధ పౌర్ణమి రోజు అమ్మవారికి జాతర నిర్వహిస్తారు. అందు భాగంగానే గ్రామంలో ప్రబలతో ఊరేగింపు చేసి ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించారు. కనకదుర్గమ్మ జాతర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎక్కడెక్కడో ఉన్న గ్రామంలోని ఆడబిడ్డలంతా తరలివచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించారు. కోళ్లను, మేకలను అమ్మవారికి బలి ఇచ్చారు. గ్రామంలో ప్రతి సంవత్సరం ఈ రోజున జాతన నిర్వహించడం ఆనవాయితీగా రావడంతో గ్రామంలో ప్రత్యేకతను చాటుకుంది.

క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ల పంపిణీ



ఎస్‌ఐను సన్మానిస్తున్న క్రీడాకారులు

తల్లాడ, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తల్లాడ ఎస్ఐ బి.కొండలరావు క్రికెట్ కిట్‌ను బహుకరించారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో స్థానిక క్రికెట్ టీం సభ్యులకు కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐను క్రీడాకారులను సన్మానించారు.